కథ

# ఔన్నత్యం

వాలి హిరణ్మయీదేవి

"నువ్వు ఎన్నయినా చెప్పరా, విదేశాలకెళ్ళిన వాళ్ళు అక్కడ స్థిరపడటమే జరుగుతోంది. అలాంటప్పుడు కోరి, రాముని దూరం చేసుకోవడమే అవుతుంది. ఆలోచించు. పైగా ఆర్థికంగా కూడా ఎన్నో ఇబ్బందుల్ని ఫేస్ చేయాల్సి వస్తుంది. ఇంటిమీద కూడా అంతలోన్ తీసుకొని పంపిస్తే ఎలా- ఏమో నాకంతగా రుచించటం లేదు. ఉన్నదంతా ఊడ్చిపెడితే రేపు మన వృద్ధాప్యంలో లేనిపోని బాధలు పడాల్సి వస్తుంది. అందుకే నేను మా కృష్ణతో ఖరాఖండిగా చెప్పేసాను నావల్ల కాదని. రెండ్రోజులు బాధపడ్డా నిజం తెలుసుకుని వాడే సర్దుకుపోతాడని నా నమ్మకం" అన్నాడు ప్రకాశరావు.

"రామూ ఇంతవరకూ నోరుతెరిచి ఇది కావాలి అనడగలేదురా. అడిగిన ఈ ఒక్కగానొక్క కోరికను తీర్చడం నా ధర్మంగా ఫీలవుతున్నాను. ఇక ముందరి లైఫంటావా ఆ విధాత ఎలా రాసి ఉంటే అలా జరుగుతుంది" అన్నాడు ఆనందరావు.

వారిద్దరూ బాల్య స్నేహితులు. ఉద్యోగరీత్యా ట్రాన్స్‌ఫర్ ఒకే ఊరికి కావడంతో మళ్ళీ ఇద్దరూ పక్క పక్క ఇళ్ళలో ఉంటున్నారు. తెలీనివాళ్ళు వాళ్ళని అన్నదమ్ములనుకునేలా ఉంటారు. ఇద్దరి కుటుంబాలకి మధ్య సఖ్యత ఎక్కువే.

"కృష్ణ పాపం, నన్నెంతో రిక్వెస్ట్ చేసాడురా..నిన్ను కన్విన్స్ చేయమని. పంపితే రాము-కృష్ణలు ఒకరికొకరు తోడుగా ఉంటారు కూడా" అన్నాడు ఆనందరావ్.

"నిజమే కానీ కృష్ణ వెనుక ఇద్దరు ఆడపిల్లలున్నారు నాకు. వారిద్దరి గురించి నేనాలోచించాలి కదా"

"నాకేమాత్రం వీలున్నా నేను ఏర్పాటు చేసేవాడిని. కానీ చూస్తున్నావ్‌గా రాముని పంపడానికే ఉన్న బంగారం అమ్మేయడం సరిపోక ఇంటిమీద అప్పుతేవడం జరుగుతోంది" నొచ్చుకుంటూ అన్నాడు ఆనందరావ్.

"నీ గురించి నాకు తెలీదా. మరేం ఫర్వాలేదు బాధపడకు" అన్నాడు ప్రకాశరావ్.

○○○

రాము లండన్ వెళ్ళిపోవడం, జాబ్‌లో సెటిలవడం గాక తన కొలీగ్ అయిన ఎలిజాను ప్రేమించి తల్లిదండ్రులతో చెప్పి వారి అంగీకారంతో పెళ్ళాడటం జరిగింది. ఎంతో బాధ్యతగా అతడు పంపిస్తోన్న డబ్బుతో అప్పులన్నీ తీర్చడమే గాక ఓ మంచి పోష్ కాలనీలో ఇండిపెండెంట్ బంగ్లా కొన్నాడు. రెండు మూడు చోట్ల స్థలాలు గాక ఆర్థికంగా చాలా పుంజుకోగల్గిన ఆనందరావ్ సాయం చేయటం వల్లనే ప్రకాశరావ్ తన కూతుళ్ళకూ మంచి సంబంధాలు తెచ్చి పెళ్ళిళ్ళు చేయగలిగాడు. ఎలిజాకు బాబు పుట్టినప్పుడు, రాము తల్లిదండ్రుల్ని తన వద్దకు పిలిపించుకున్నాడు. మూడు నెలలు, మూడు నిముషాల్లా గడిపి అక్కడివన్నీ చూసి ఎంతో ఆనందంతో తిరిగివచ్చారు ఆనందరావు-భారతి.

ఇక కృష్ణ బెంగుళూర్లో జాబ్ సంపాదించుకుని వెళ్ళాడు. తండ్రిమీద ఓ రెండేళ్ళు అలిగి ఎడమొగంగా వున్నా ఆనందరావు మాటలతో ఆ కోపం తగ్గించుకొని తల్లిదండ్రులతో బాగానే ఉంటున్నాడు. పిల్లలంతా సెటిలవదంతో ప్రకాశరావు కాస్త నిశ్చింతగానే ఉంటున్నాడు. స్నేహితులిద్దరూ బాధ్యతలు తీరడంతో తోచిన సామాజిక సేవ చేస్తూ కులాసాగా ఉంటున్నారు.

○○○

రోజులు చకచకా దొర్లిపోతున్నాయి.

"హలో రామూ.. నాన్న వినబడుతోందా?"

"ఏంటి నాన్నా? ఎప్పుడూ లేంది ఈ టైమ్‌లో- మీరెలా ఉన్నారు. అమ్మ ఎలా ఉంది" నిద్రమత్తుని వదిలించుకుంటూ ఆదుర్దాగా అడిగాడు రాము. భర్త లేచిన అలికిడికి చటుక్కున తనూ లేచింది ఎలిజా.

"మేము బాగానే ఉన్నాంరా కానీ..." అంటూ ఆగాడు ఆనందరావు.

"ఏమైంది నాన్నా - ఈసారి మన జూలీ పిల్లలు మాకోసం బెంగపెట్టుకొన్నాయా?" లాలనగా అడిగాడు.

తనొచ్చిన కొత్తల్లో టామీ తనకోసం బెంగపెట్టుకుంటే, ఆ విషయం చెప్పి కళ్ళనీళ్ళ పర్యంతమైన తండ్రి కారుణ్యం గుర్తుకొచ్చి.

"అదిగాదురా. నీ ఆయా కమలమ్మకి ఒంట్లో బావుండటం లేదురా. నిన్ను చూడాలని ఉందని పాపం నాతో చాలాసార్లు అన్నది. వీలుచేసుకుని ఇండియాకు రాగలవా?" ఆదుర్దాగా అడిగాడు.

"అయ్యో అలాగా మొన్న నేనొచ్చినప్పుడు తనకి గోల్డ్ చైన్ తెచ్చానని ఎంతో సంబరపడింది. ఇంతలోనే ఏం కంప్లైంట్ నాన్నా? ఏమైంది? నాన్నా.. డబ్బు కోసం చూడకండి. మీరలా చేయరని తెలుసుగానీ. మంచి హాస్పిటల్‌లో చూపించండి. ఆమెకి వయసుమీద పడుతోంది గదా..మాకు ఇప్పట్లో రావడం కుదరదు నాన్నా. అర్థం చేసుకోండి. అమ్మ కూడా మొన్న ఇదే విషయం చెప్పిందట ఎలిజాతో. తను కూడా అంటోంది ఓసారి ఎలాగన్నా వీలు చేసుకుని వెళ్ళండి అని. కానీ కొత్తప్రాజెక్ట్ వర్క్ ఉంది. రాలేనిప్పట్లో" నిస్సహాయంగా చెప్పాడు రమేష్‌చంద్ర.

"అలాగంటే ఇంకేం మాట్లాడనురా..కానీ..నీతో అదే నిన్ను..సరేలే..ఉంటాను" అంటూ ఫోన్ కట్ చేశాడు ఆనందరావు.

తండ్రి గొంతులో ఇదివరకెన్నడెరగని ఉద్విగ్నత-దుఃఖం, గమనించి, "నాన్నది సున్నిత హృదయం- మీదపడుతున్న వృద్ధాప్యం కూడా అనవసరపు దిగులు కల్గిస్తున్నట్లుంది" అన్నాడు ఎలిజాతో.

"వాళ్ళ సంగతి తెల్సుగా..అనవసరంగా మనవరకూ ఏదీ తీసుకురారు. ఏమాత్రం వీలున్నా ఇండియాకు వెళ్ళేందుకు ట్రై చేయండి" అంది ఎలీజా.

తన చిన్ననాటి సంగతులూ- ఫోన్‌లలో తల్లిదండ్రుల ద్వారా తెల్సిన సంగతులు ఎప్పటికప్పుడు ఎలీజాకు తెలిజేస్తూండటం రమేష్‌చంద్రకలవాటు. దాంతో ఇండియాలో ముఖ్యంగా తన భర్త ఇంట్లో జరిగే పండుగ పబ్బాలు వాళ్ళ ఆచార వ్యవహారాలు ఎలీజాకు తెలిసిపోయాయ్. భర్త చిన్నతనంలో అత్తగారికి పాలుపడకపోవటంతో, కమలమ్మనే ఆయాని కదుర్చుకున్నారని, పిల్లలు లేని ఆమె రమేష్‌చంద్రనే కొడుకుకన్నా మిన్నగా చూసుకుందని తెలుసుకొని ఆశ్చర్యపోయింది. ఇలాంటి పనివాళ్ళూ దొరుకుతారని, అలా దొరికిన ఆమెని వీళ్ళు పరాయిగా గాక స్వంతమనిషిలా ఆదరించడమూ ఆమెకెంతో నచ్చిన విషయం. అందుకే కమలమ్మకు ఒంట్లో బాగాలేదంటే, ఆమెకూ చాలా బాధ కలిగింది.

○○○


"అమ్మా..మీరింకా ఎంతసేపుంటారిక్కడ..ఇంట్లోకెళ్ళి రెస్ట్ తీసుకోండమ్మా" అంది నీరసంగా కమలమ్మ, ఔట్‌హౌస్‌లో ఉన్న తన దగ్గరే మూడు గంటలుగా కూర్చుండిపోయిన కౌసల్యతో. బాగా బతికి చెడిన కుటుంబంలో నుండి వచ్చిన కమలమ్మ, ఇరవై ఎనిమిదేళ్ళుగా కౌసల్యా వాళ్ళ ఇంట్లోనే ఉండిపోవడం వల్ల మాటయాస ఉండదు. తెలిని

**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథలపోటీలో ఎంపికైన రచన**

వాళ్ళు ఆమెకు వాళ్ళ బంధువే అనుకుంటారు. అదే చెబితే "అవును ఆమె మాకు ఆప్తబంధువే" అంటాడు ఆనంద రావు. వత్తాసుగా కౌసల్య నవ్వుతుంది. కమలమ్మకి రెండు నెలలుగా అనారోగ్యం. అందుకే వేరే పనిమనిషిని కుదుర్చు కున్నారు. ఔట్‌హౌస్‌లో ఉన్న కమలమ్మని డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళడం, ఆమెకి పూర్తిగా రెస్ట్ దొరికేలా చేయడమూ చేస్తున్నారు ఆనందరావూ-కౌసల్యలు. కౌసల్య ఇచ్చిన పళ్ళ రసం తాగి,

"అమ్మా మీరు మీ పెద్దమనసుతో నన్నింతగా పట్టించుకుంటున్నారు. ఎన్ని జన్మలెత్తినా మీ ఋణం తీర్చుకోలేనేమో" అంది కమలమ్మ.

"అలా అనకు. మనిషికి మనిషే సాయం. నేను జబ్బు పడ్డప్పుడు కుడీ-ఎడమ చేయన్న తేడా చూపించకుండా సేవలు చేశావు. వాటితో పోలిస్తే ఇదెంతని? ఇక రాముకి ఆక్సిడెంటయినప్పుడైతే వద్దంటున్నా వినకుండా ఏకంగా రక్తాన్నే ఇచ్చావ్. ఇవన్నీ మరిచిపోగలనా" అంది కౌసల్య.



"ఇదంతా మీ సంస్కారమమ్మా. నన్ను సొంతమనిషిలా చూసుకోబట్టేగా నేనలా చేయగలిగింది. ఏ జన్మలో చేసుకున్న పుణ్యం వల్లనో మీలాంటి వారి అండ దొరికింది" అంది ఆయాసపడుతూ కమలమ్మ.

"ఏదో ఋణానుబంధం ఉండే ఉంటుందిలే. రెస్టు తీసుకో. మందులు కరెక్ట్‌గా వేసుకో, అసలే ఆయాసపడుతున్నావ్. ఎక్కువగా మాట్లాడకు" అంటూ నిండా దుప్పటి కప్పింది.

"అమ్మా..మరి..మరి నాకు నిజంగా కాన్సర్ జబ్బే వచ్చిందా? నిజం చెప్పండమ్మా..నిండా మునిగిన నాకు చలేంటి?" అంది దీనంగా.

ఒక్క క్షణంపాటు ఏం చెప్పాలో తోచలేదు కౌసల్యకు.

"నిజం చెప్పండమ్మా. నేనింకా ఎంతకాలం బతుకుతానన్నాడు డాక్టర్" అడిగింది కమలమ్మ.

"ఛ...ఇంత బేలవయిపోయావేంటి? తొందరలోనే కోలుకుంటావన్నాడు. ఈయనతో గాకుండా మరో డాక్టర్‌కి చూపిస్తాం. ఎంత డబ్బు ఖర్చయినా వెనుకాడవద్దని రాము చెప్పాడు. అందుకని మరింత డబ్బు పంపాడు తెలుసా" అంది కౌసల్య.

రాము మాట చెవిన బడటంతోనే కమలమ్మ ముఖం విప్పారింది.

"బాబు అలా అన్నాడా? నేనంటే ఎంత ప్రేమమ్మా. నాకోసం ఏ డబ్బూ పంపక్కర లేదు. ఓసారి వస్తే చాలు. కళ్ళారా చూస్తాను. ఆ తర్వాత నా ప్రాణం ఎప్పుడు పోయినా ఫర్వాలేదు"

"ఏంటలా చావు నామం జపిస్తావ్. రాముకు చేసినట్లు వాడి కొడుక్కి కూడా నువ్వన్నీ చేయాలని నిన్ను తనతో తీసుకు వెడతానని వాడంటూంటే...అసలే కోడలు రెండోసారి తల్లి కాబోతోంది కదా"

"అయితే కోడలుగారిక్కడికి డెలివరీకి రారా? మనమే వెళ్ళాలా?" సంతోషంగా అడిగింది.

"మనమే వెళ్ళాలి. అక్కడ డెలివరి అయ్యాక పుట్టిన బిడ్డను చూసుకోవడాన్కి మనుషులు దొరకరట. దొరికినా మనలా చేయలేరట. అందుకే కోడలు 'మీ ఆయమ్మను తీసుకొని అత్తగారిని రమ్మనండి' అంటూ ఉంటుందట" అంది కౌసల్య.

"అలాగావమ్మా. నేను నా మందులు కరెక్ట్‌గా వేసుకుంటే ఇంకా తొందరగా తగ్గిపోతుందిగా" అంది గొంతులోకి ఉత్సాహం దూసుకురాగా.

○○○

"పాపం కమలమ్మకి తన జబ్బు తొందరగా తగ్గాలని ఎంత కోరికగా ఉందో తెలుసాండీ" అంటూ, భోజనాలయ్యాక ఆనందరావుతో తమ సంభాషణ మొత్తం వివ

రించింది కౌసల్య.

ఆఫీసులోనూ బైట జరిగిన ప్రతీ విషయాన్ని భార్యతో పంచుకోవడం అతని అలవాటయితే ఇంటిలోని తెలిసిన వారి విషయాలూ చెప్పడమూ ఆమెకలవాటు. అక్కడ విషయానికంటే తమ మధ్య సాన్నిహిత్యం బలపడటానికే ప్రాధాన్యత నిస్తారు వాళ్ళు. అదే అలవాటు కొద్దీ కౌసల్య కమలమ్మతో మాట్లాడినవి తు.చ. తప్పకుండా చెబితే, ఆనందరావు మనసు విలవిలలాడింది.

ఆమె పరిస్థితి రోజులలో ఉందన్న విషయం, కౌసల్యకి తెలీకుండా దాచాడతను. కమలమ్మ మనసులో ఉన్న కోరిక తెలిసి ఏం చేయాలో తోచలేదు. అందుకే సాయంత్రం, అలవాటుగా గార్డెన్‌కి వెళ్ళినా పరధ్యానంగా కూర్చుండిపోయాడు.

"ఏంటో దీర్ఘాలోచనలో మునిగావ్" అంటూ వచ్చాడు ప్రకాశరావ్. యధాలాపంగా చెప్పినట్లు కమలమ్మ విషయం చెప్పాడు.

"పాపం మంచి మనిషి. మా ఇంట్లో జరిగిన ప్రతీ శుభా-శుభాలకు వచ్చి అడక్కుండా అన్ని పనులు చేసి పెట్టింది. మా అమ్మ చివరి రోజుల్లో కమలమ్మ సాయం మాకందకుంటే ఎంత ఇబ్బందిపడిపోయి ఉండేవాళ్ళమో. మా అమ్మగారి అంత్యక్రియలప్పుడైతేనేం, దశదిన కర్మలప్పుడైతేనేం..తద్దినాలప్పుడైతేనేం ప్రతీసారీ వచ్చి చేతిలో పని అందుకొంది. అందుకేనేమో ఆమె అనారోగ్యం మా ఇంట్లో వారందరికీ చాలా బాధని కల్గిస్తోంది" అన్నాడు ప్రకాశరావ్.

"తనకంటూ ఎవరూ లేకపోవడంతో మా రాము మీద బాగా అభిమానం పెంచుకొంది. వాణ్ణి చూడాలని ఉందంటుంది. ఆమె కోరిక మేరకు వాడిక్కడికి రావాలంటే ఎలా కుదురుతుంది? అలాగని మౌనం వహించడానికీ మనసు రావడం లేదు. ఆమె పాలిచ్చి పెంచుకుంటే రాము మాకు దక్కేవాడే కాదు" అన్నాడు ఆనందరావ్.

"అన్నట్లు ఓసారి నాతో అన్నది 'కొడుకుగా మీరు మీ అమ్మగారికి తలకొరివి పెట్టారు. ఆమెకు సద్గతులు ప్రాప్తించడానికి. మరి కొడుకులు లేని వాళ్ళ సంగతేంటి? అని మనవలుతో పెట్టించవచ్చు' అన్నాను. మనవలు లేకపోతే మనం కొడుకుగా పెంచుకొన్నవారితోనైనా ఆఖరికి కొడుకుగా భావించిన వారితోనైనా తలకొరివి పెట్టించుకోవచ్చని అన్నాను. ఐతే నేను మా రాము బాబుతో తలకొరివి పెట్టించుకుంటాను. మరి పుణ్యలోకాలకు పోవాలిగా" అన్నది. అదే మాట మనసులో మెదిలి రాము గురించి అడుగుతోందో ఏంటో" అన్నాడు ప్రకాశరావ్.

ఆ రాత్రి ఎలిజా ఫోన్ చేసినప్పుడు కమలమ్మ సంగతి మరో మారు ప్రస్తావించకుండా ఉండలేక పోయాడు ఆనందరావు. "మా బిడ్డలను చూడాలన్న ఆమె కోరిక నెరవేరాలని..తొందరగా జబ్బు నుండి కోలుకోవాలని- ఒకవేళ మరణం అనివార్యమయితే ప్రశాంత మరణం ప్రసాదించమని చర్చిలో రోజూ ప్రేయర్ చేస్తున్నాను" అంది.

ఆమె గొంతులో కదలాడే నిజాయితీ, అతనికి సాంత్వన కల్గించింది. చూస్తుండగా వారం గడిచిపోయింది.

పదవుతూండగా కమలమ్మ దగ్గరకు జావ తీసుకొని వెళ్ళింది కౌసల్య. కమలమ్మ పరిస్థితిని చూస్తూనే రివ్వున వెనుదిగిరి పరుగు పరుగున ఇంట్లోకి వచ్చింది.

"ఏమండీ కమలమ్మకి బాగా ఎగశ్వాసలా వస్తోంది. నాకేంటో భయంగా వుంది" అంది. వెంటనే ఆనందరావ్, ఆమెతో బాటూ ఔట్‌హౌస్‌లోకి నడిచాడు.

చల్లబడుతున్న ఆమె చేతులకూ, కాళ్ళకు తైలాన్ని తీసుకొని మర్దనా చేయసాగింది కౌసల్య. ఆనందరావ్ డాక్టర్‌కి ఫోన్ చేసి అతని రాకకోసం ఎదురుచూడసాగాడు.

అతి ప్రయాసతో, బరువుగా వాలిపోతున్న కనురెప్పలను కదిల్చి- అతనివైపు చూసింది కమలమ్మ. మెల్లగా చేతులు జోడించబోయింది.

ఆమె కళ్ళలో కదలాడే కోరిక తెలిసీ, తన అశక్తతతో ఆమెకు బదులు ఈయలేక, ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని మెల్లగా నిమరసాగాడు. పెదవి కదిపితే గొంతులో గరగరలాడే దుఃఖం బయటకు తన్నుకొచ్చేలా ఉందతనికి. కన్నీరు మున్నీరవుతున్న కౌసల్యను చూస్తూ 'ఎంతయినా ఆడవాళ్ళు అదృష్టవంతులు. వారి భావోద్వేగాలను నిస్సంకోచంగా వెలిబుచ్చగలరు' అనుకున్నాడు. జలపాతంలా దూకే కన్నీటిని, అదుపులో ఉంచుకోవడానికి నానా అవస్థ పడుతూ.

అలికిడయితే డాక్టర్ వచ్చాడనుకొని, తలతిప్పిన ఆనందరావ్ సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు. కౌసల్య పరిస్థితీ అందుకు భిన్నంగా లేదు. గుమ్మంలో నిలువెత్తునా నిలబడి ఉన్నాడు రమేశ్చంద్ర.

"అమ్మా..నాన్నా..మీకోసం ఇల్లంతా వెదికి ఇటొచ్చాను" అంటూ ఆనందంతో ఇంకా ఏదో అనబోతూ వారిద్దరి దీనవదనాలని చూసి, నాలుక్కరుకుని "ఆయమ్మకెలా ఉంది. ఆమె హాస్పిటల్లో ఉంటుందనుకొన్నాను" అన్నాడు సంజాయిషీగా.

"కమలమ్మా..చూడు ఎవరొచ్చారో మన రాము వచ్చాడు" ఆనందంగా అరిచినట్లే చెప్పింది కౌసల్య.

చటుక్కున కళ్ళు తెరిచింది కమలమ్మ. ఆమె కళ్ళలో సంతోషం పౌర్ణమినాటి సంద్రపు అలలా ఉవ్వెత్తున కదలాడింది. వణుకుతూ అతడి వైపు చేతులు సాచింది.

జాలిగా ఆమెనే చూస్తున్న రాము తల్లి సైగతో వెళ్ళి ఆమె పక్కగా కూర్చుని, ఆ చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు. సన్నగా ఎండుపుల్లలా మారిన ఆ చేతుల్ని చూస్తే "ఈ చేతులతో తనకి స్నానం చేయించింది, తనకు సేవలన్నీ చేసింది. తన స్తన్యమిచ్చి ప్రాణం పోసింది. తనెంత ఎదిగినా పసివాడిలాగే చూసింది. అంత మంచి మనిషికి దేవుడీ శిక్ష ఎందుకు విధించాడో" అనుకొంటూ తల్లి వంక చూశాడు. అతని కళ్ళ అప్రయత్నంగా కన్నీళ్ళొచ్చాయ్. అతని కన్నీళ్ళు తన మీద పడగానే కమలమ్మకి ఎక్కడ్లేని సంతృప్తి కల్గింది.

"కమలమ్మా..నా మాటలు వినబడుతున్నాయా? నువ్ కోరుకున్నట్లే మన రాము వచ్చాడు. నీ పక్కనే ఉన్నాడు..చూస్తున్నావుగా" అంది కౌసల్య.

ఆనందరావ్, కమలమ్మ దగ్గరికి వెళ్ళి ఆమె చెవిలో " కమలమ్మా నువ్ కోరుకున్నట్లు మన

## బిజీ జియా

'నిశ్శబ్ద్' చిత్రంతో సంచలనం సృష్టించిన జియా ఖాన్‌ని ఆ తర్వాత సినిమాల్లో తీసుకోడానికి బాలీవుడ్ నిర్మాతలు అంత ఆసక్తి కనబర్చలేదు. కానీ ఆమెకి మంచి రోజులు వచ్చాయి. ఇప్పుడామె మూడు చిత్రాలు చేస్తోంది. 'గజినీ' హిందీ వెర్షన్‌లో నయనతార వేషాన్ని ధరిస్తున్న జియాఖాన్ మరో రెండు చిత్రాల్లో కూడా అవకాశాలు కొట్టేసింది. ముందు ముందు మరింత బిజీ అవుతాను, చూస్తుండండి అంటోంది జియా.



రాముతో నీ తలకొరివి పెట్టిస్తాను నమ్ము" అన్నాడు. ఆ మాటలు వింటూనే ఆమె పెదవులు విచ్చుకున్నాయ్. రాముని అభిమానంగా స్పర్శించాలనిపైకి లేచిన ఆమె చేతులు నిర్జీవంగా వాలిపోయాయి. కౌసల్య ఒక్కసారిగా గొల్లుమంది తల్లిని ఓదార్చసాగాడు రాము. ఒక్కసారిగా పదేళ్ళు మీదపడ్డట్లుగా అయిన తండ్రిని చూస్తే మనస్సు కలుక్కుమంది. ఒక పనిమనిషి కోసం అంతగా విల విలలాడుతున్న వారి మానవత్వానికి, మనసులోనే జోహార్లర్పించాడతను. ఆ తర్వాత తండ్రి చెప్పినట్లే అన్ని విధులు సక్రమంగా నిర్వర్తించాడు రమేష్‌చంద్ర.

○○○

"అమ్మా..నేను అకస్మాత్తుగా వచ్చి నీ కళ్ళలో ఆనందాన్ని చూడాలనుకుంటే ఇలా జరిగిందేవిటి? ఆయమ్మ మరణం కన్నా నీ విచారం నన్ను చాలా బాధపెడుతోంది" అంటున్న రాము చెంపలను ప్రేమగా నిమిరింది కౌసల్య.

"అవున్రా అంత సడెన్‌గా ఎలా రాగలిగావ్" ఆసక్తిగా అడిగింది.

"కొత్తప్రాజెక్ట్ విషయంలో ఇండియాకు రావలసిన నాపై అధికారి సిక్ కావడం, అతని ప్లేస్‌లో నన్ను వెళ్ళమంటూ ఎలీజా రిక్వెస్ట్ చేయడంతో నేనిండియాకు రాగలిగాను. లక్కీగా కాన్ఫరెన్స్ రెండు రోజుల్లోనే ముగియడంతో మన ఊరికి వచ్చేశాను. లేకుంటే అట్నుంచి అంటే వెళ్ళాల్సి వచ్చేది" అన్నాడు రాము.

"అన్నట్లు ఎలీజా డెలీవరికి- టైమ్ దగ్గర పడింది కదా-ఎవరన్నా అదే నర్స్ దొరికిందా?" అడిగింది కౌసల్య.

"అక్కడ ఎవరు దొరికినా- వాళ్ళకి పద్ధతులు చెప్పాల్సింది నువ్వేనమ్మా -వచ్చే నెలలో మీరిద్దరూ అక్కడికి వచ్చే ఏర్పాట్లని చేసాను" అన్నాడు రాము.

"సరే చాలా పొద్దుపోయింది గానీ ఇక పడుకో..బాగా అలిసిపోయావ్" అంది కౌసల్య. తమ బెడ్‌రూమ్‌లోకి వెడుతూ. వెళ్ళి నిద్రమాత్ర వేసుకొని మంచం మీద ఒరిగింది.

○○○

"రామూ..పడుకొన్నావా?" అడిగాడు ఆనందరావ్.

"రండి నాన్నా..ఇంకా నిద్ర పట్టలేదు. నేనిక్కడికి రాగానే ఆయమ్మ పోవడం మీరిద్దరూ ఇంతగా డిస్టర్బ్ కావడం ఇవన్నీ బాధ కల్గించాయి. అమ్మ ఆడది కాబట్టి అంతలా బాధపడింది. మీరు కూడా ఇంతలా కదిలిపోవడం నాకాశ్చర్యంగా ఉంది. అమ్మ ఎలా కోలుకుంటుందాని చాలా దిగులుగా ఉంది"

కొడుకంతగా బాధపడటం చూసి "రామూ నీకో నిజం చెప్పాలి. అది విని ఎలా తట్టుకుంటావో? మమ్మల్ని ద్వేషిస్తావో మరి" అన్నాడు ఆనందరావ్ గిల్టీగా.

"మిమ్మల్ని ద్వేషించడమా నెవర్ ఇంతకీ విషయం ఏమిటి?"

"ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు. పెళ్ళైన ఎన్నో ఏళ్ళ తర్వాత గర్భవతి అయిన మీ అమ్మ మృతశిశువుకి జన్మనిచ్చింది. మరో బిడ్డ పుట్టే ఛాన్స్ లేదని డాక్టర్లన్నారు. ఏం చేయాలో మీ అమ్మకి మెలకు వచ్చాక ఏం చెప్పాలో తోచక తికమక పడుతున్నాను. సరిగ్గా అప్పుడే అదే రోజున బిడ్డకు జన్మనిచ్చిన కమలమ్మ కన్పించింది. ఏడుస్తూన్న ఆమెని చూసి విషయం ఏంటని అడిగాను. తన బిడ్డ కపులో పడగానే భర్తను కోల్పోయానని, ఆదుకోవడాన్కి ఎవరూ లేని తను బిడ్డనెలా పెంచగలనని వాపోయేసరికి, "మీ అమ్మ విషయం చెప్పి బాబుని మాకిమ్మని బిడ్డకు ఆయాగా తనకెప్పటికీ ఆశ్రయం ఇస్తానని ఈ రహస్యం మాత్రం మన మధ్యే ఉండాలని" ప్రాధేయపడ్డాను.

ఆమె అందుకు అంగీకరించింది. అలా ఆమె బిడ్డవు-మా బిడ్డగా మారిపోయావు. మీ అమ్మకు పాలు పడకపోవటంతో కమలమ్మని పాలు ఇమ్మని ఆయాగా ఉండమని మీ అమ్మ కోరింది. అలా కమలమ్మ మనింట్లోని మనిషిగా మారిపోయింది. నీతో తలకొరివి పెట్టించమని ఆమె అడిగినప్పుడు కాదనలేకపోయాను. మీ అమ్మ ఆమె కోరికకు ఆశ్చర్యపోయినా పాలిచ్చిన మమకారం వల్ల నిన్ను స్వంత కొడుకుగా భావిస్తోందని అనుకుంది. నీకెప్పుడు ఫోన్ చేసినా 'నువ్ రాలేనని' చెబుతూ వచ్చావ్. ఇంత ఉపకారం చేసిన ఆ మనిషి చివరికోరిక తీరేలా చేయి తండ్రీ అంటూ దేవుడి మీదే భారం వేశాను. మొత్తానికామె కోరిక తీర్చాడా భగవంతుడు. రామూ, మీ అమ్మకి చెప్పకుండా దాచిన రహస్యం ఇదొక్కటే. నువ్వీ రహస్యం వెల్లడి చేసి ఆమె ఆనందాన్ని హరించకురా ఈ వయసులో అస్సలు తట్టుకోలేదు" అన్నాడు ఆనందరావ్.

స్టన్నయిపోయాడు రమేశ్చంద్ర. తల్లిదండ్రులు తనమీద చూపించిన ప్రేమాభిమానాలు తను అనారోగ్యం పాలయినప్పుడల్లా, కళ్ళలో పెట్టుకొని చేసిన సేవలూ కళ్ళముందు కదలాడాయి. వృద్ధాప్యంలో తమకో ఆసరా ఉండాలని కూడా చూసుకోకుండా, తన కెరీర్ కోసం, తండ్రి చేసిన అప్పులు, పసుపు కుంకుమగా ఇచ్చిన పొలాన్ని కూడా అమ్మేసి తల్లి ఇచ్చిన డబ్బులు, అన్నీ గుర్తుకొచ్చి కళ్ళనీళ్ళ పర్యంతమయ్యాడు. తల్లి సరే నిజం తెలీక తనకోసం అల్లాడిపోయింది. మరి తండ్రి? అతని ఔన్నత్యాన్ని ఏపరికంతో తను కొలువగలడు? కన్నతండ్రులే అమర్చలేనివన్నీ తనకు అమర్చాడాయన. "నాన్నా! పాయమ్మ కన్న బిడ్డవని భావించకుండా నన్ను స్వంత కొడుకులాగే భావించి, నాకోసం పూర్తి బాధ్యత వహించడం మామూలు మనిషి చేయలేడు. నువ్వు మహా మనీషివి గాబట్టి చేశావు. ఇప్పటికీ మీ ఇద్దర్నీ ఎంతో ప్రేమించే ఎలీజా, ఈ విషయం తెల్సుకొంటే మరెంత గౌరవిస్తుందో. మీరు వద్దంటే ఎలీజాకు చెప్పను. ఈ రహస్యం ఇక మనిద్దరి మధ్యనే ఉండిపోనీయండి" అన్నాడు రమేశ్చంద్ర ఉద్వేగంగా.

"నాన్నా- మరో విషయం వింటే విషయం చెప్పినా అమ్మనగానే నా కళ్ళలో మెదుల్తున్నది అమ్మనే ఆయమ్మ కాదు. అందుకే ఆయమ్మ మరణంకన్నా అమ్మ దుఃఖమే బాధ కల్గిస్తోందంటే మీరే అర్థం చేసుకోండి" అన్నాడు రమేశ్చంద్ర. అది విన్న ఆనందరావ్, ఆనందోద్వేగాలతో అతడిని హత్తుకున్నాడు.

○

## అమ్మ అవుతున్న మాళవిక

ఆమధ్య బెంగుళూరు వ్యాపారవేత్తని పెళ్లాడిన మాళవిక తన సినిమా కెరీర్‌ని మాత్రం వదల్లేదు. హీరోయిన్‌గానే కాకుండా ఐటమ్ గాళ్‌గా కూడా డాన్సులు చేస్తోంది. ఆమె ఇటీవలే తమిళ యువ హీరో విజయ్‌తో 'కురువి' అనే సినిమా కోసం చేసిన ఐటమ్ నంబర్ షూటింగ్ దశలోనే బాగా పాపులర్ అయింది. ఇప్పుడామె అన్ని సినిమా, టీవీ షూటింగ్‌లను పూర్తిచేసేసుకుని 'మెటర్నిటీ లీవ్' పెట్టిందనేది కోలీవుడ్ న్యూస్. పాపో, బాబో పుట్టాక, విశ్రాంతి తర్వాత కొన్ని నెలలకి తిరిగి షూటింగ్‌లలో మాళవిక పాల్గొంటుందనేది సమాచారం.

